# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వైద్యులు అత్యవసర సమయాల్లో రోగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు.**
2. **సోమవారం జరిగే పోలింగ్ కు 48 గంటల ముందు నిశ్శబ్ద కాలం అమల్లో ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.**
3. **రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఈ రోజు సాయంత్రం 6 గంటలకు ముగియనుంది.**
4. **ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి జాతీయ అధ్యక్షులు జె.పి.నడ్డా ఈరోజు తిరుపతిలో నిర్వహించిన రోడ్ షో లో పాల్గొన్నారు.**
5. **ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు ఈ రోజు, రేపు కూడా కొనసాగుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.**

==========================

అత్యవసర వైద్యంలో ప్రాణాలను కాపాడే గోల్డెన్ అవర్ అత్యంత ముఖ్యమైనదని, ఈ కీలక సమయంలో రోగులకు చికిత్స లభిస్తే వారి ప్రాణాలను రక్షించవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. నిన్న ఢిల్లీలో జరిగిన జాతీయ వైద్య విజ్ఞాన పరీక్షల మండలి 22వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ప్రసంగిస్తూ, స్పెషలిస్ట్ డాక్టర్లు అత్యవసర రోగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రాణాపాయంలో ఉన్న వారిని చికిత్స కోసం వేరే చోటికి వెళ్లమని ఎప్పుడూ సూచించరాదని కోరారు. ఖర్చుతో కూడుకున్న సత్వరమైన, సున్నితమైన ఆరోగ్య సంరక్షణ పట్ల వైద్యులు శ్రద్ధ వహించాలని కోరారు. పేద రోగులకు ఉచితంగా సమయాన్ని వెచ్చించడం ద్వారా దేశానికి సమాజానికి ఎనలేని సేవలందించవచ్చని తెలిపారు. వైద్య వృత్తి ఎంచుకుంటే మానవాళికి సేవ చేయాలనే తపన తప్పకుండా ఉంటుందని ద్రౌపది ముర్ము వైద్య విద్యార్థులకు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఈ రోజు సాయంత్రం 6 గంటలకు ముగియనుందని, సోమవారం జరిగే పోలింగ్‌కు 48 గంటల ముందు ఎటువంటి ప్రచారం లేకుండా నిశ్శబ్ద కాలం అమల్లో ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఈ సమయంలో ఎటువంటి సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ ప్రచురించడం, ప్రసారం చేయకూడదని అన్నారు. రీపోలింగ్‌కు తావు లేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు.

--------------------------

నాలుగో విడత ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న పోలింగ్ జరిగే 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 96 నియోజక వర్గాలలో ఈ సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగుస్తుంది, ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలతో సహా పోలింగ్ జరిగే రాష్ట్రాలలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరగాల్సి ఉండగా, కొన్ని చోట్ల వాతావరణం దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

---------------------------

రాష్ట్రంలో శాసనసభతో పాటు లోక్ సభకు సోమవారం జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అర్హత వున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఓటరుగా అర్హత పొంది ఓటరు గుర్తింపు కార్డు లేని వారు అందుకు ప్రత్యామ్నాయంగా ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి 12 గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చునని తెలిపింది. ఓటరు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అధికారుల వద్ద ఓటు వివరాలు సరిచూసుకున్న తరువాత ఈవీయం యూనిట్ వద్దకు వెళ్లి ఓటు వేయాలని నిర్ణయించుకున్న అభ్యర్థి పేరు వద్ద వున్న మీటను నొక్కాలి. ఈ మీటను నొక్కిన వెంటనే పక్కనే వున్న బాణం గుర్తులో ఎరుపు రంగు లైటు వెలిగి బీప్ శబ్దం వచ్చి వీవీప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు వివరాలతో ఉన్నచీటీ ఏడు క్షణాల పాటు మాత్రమే కనిపించి వీవీప్యాట్ యంత్రంలో పడిపోతుంది. ఆ సమయంలో ఆ చీటీని ఓటరు పరిశీలించి తాము వేసిన ఓటు సక్రమంగా పోలైందీ, లేనిదీ నిర్ధారించుకోవచ్చని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో లోక్ సభ, శాసన సభలకు ఏక కాలంలో ఎన్నికలు జరుగుతున్నందున రెండు బ్యాలెట్ యూనిట్లలో అభ్యర్థులకు వేర్వేరుగా ఇదే విధానంలో ఓటు వేయవలసి వుంటుందని పేర్కొంది.

---------------------------

ఎన్డీయే సారథ్యంలో దేశం సంక్షేమ, సురక్షిత్ భారత్ దిశగా పయనిస్తోందని బిజెపి జాతీయ అధ్యక్షులు జె.పి.నడ్డా తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతిలో పర్యటించిన ఆయన ఈరోజు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలోని జ్యోతిరావ్ పూలే సర్కిల్ నుంచి గాంధీ రోడ్డు వరకు నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జె.పి.నడ్డా మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం ఎన్డీఏ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావలసిన అవసరముందని తెలిపారు. రోడ్డు షో అనంతరం మధ్యాహ్నం కర్నూలు జిల్లా అదోనీలోని స్థానిక మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

---------------------------

మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేశామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఈ రోజు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 59 నెలల్లో లంచాలు, వివక్ష లేని పాలన అందించామని, వివిధ రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మర్చామని, 2 లక్షల 31 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. సభ అనంతరం ఏలూరు లోక్సభ స్థానం పరిధిలోని కైకలూరులో తాలూకా ఆఫీస్ సెంటర్ లో జరిగే సభలో పాల్గొంటారు. అనంతరం కాకినాడ జిల్లా పిఠాపురం ఉప్పాడ బస్టాండ్ సెంటర్ లో జరిగే సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

---------------------------

అధిక ధరలు, పన్నులతో ప్రజలపై వైసీపీ ప్రభుత్వం అధిక భారం మోపిందని రాజమహేంద్రవరం

కూటమి బీజేపీ ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో టీడీపీ అభ్యర్థి అదిరెడ్డి వాసుతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, రాజమహేంద్రవర పట్ల తనకు పూర్తి అవగాహన ఉందని, అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని ఆదర్శనియోజకవరంగా మారుస్తానని హామీ ఇచ్చారు. గోదావరి ప్రక్షాళన కోసం కేంద్రం నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం వాటిని సద్వినియోగం చేయలేదని తెలిపారు.

---------------------------

వచ్చే విద్యా సంవత్సరం 2024-25 ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం తరగతులను సెప్టెంబరు 15లోపు ప్రారంభించాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి -ఏఐసీటీఈ నిర్దేశించింది. ఈ మేరకు విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను విడుదల చేసింది. జూన్ 30వ తేదీ నాటికి కళాశాలలకు తుది అనుమతులు జారీ చేస్తామని, ఆయా విశ్వవిద్యాలయాలు జులై 31వ తేదీలోపు అనుబంధ గుర్తింపు ఇవ్వాలని ఆదేశించింది.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల పోలింగ్ కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. విజయవాడలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎక్కడా రీపోలింగ్ కు ఆస్కారం లేకుండా ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు మొత్తం 1592 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని చర్యలు చేపట్టమన్నారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే, సత్వర పరిష్కారం కోసం సాంకేతిక నిపుణులను అందుబాటులో ఉంచామని తెలిపారు. విజయవాడ పోలీస్ కమిషనర్ పీహెచ్డీ రామకృష్ణ మాట్లాడుతూ, 332 ప్రాంతాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించమని ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశామన్నారు .అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని - శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు

---------------------------

ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు ఈరోజు, రేపు కూడా కొనసాగుతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈరోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, కర్నూలు, అనంతపురం అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడ క్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. రేపు కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో మోస్తరు నుంచి భారీ వర్షాలు, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వానలు మరింత విస్తారంగా కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

---------------------------

పోలింగ్ సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల్లో పనిచేసే అధికారులు ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ప్రకాశం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై ఒంగోలులో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంపిణీ కేంద్రంలో సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసేలా ప్రత్యేక కేంద్రాన్ని అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

=====================